క్లుప్తంగా

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి

డిండి : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టే పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామా శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డిండి గ్రామ శాఖా నూతన కార్యదర్శిగా బూషిపాక నీరంజన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటయ్య,నీరంజన్, వెంకటయ్య, బాలయ్య,లక్ష్మయ్య, సైదమ్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దవూర : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని బాసోనిబావి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూన్‌రెడ్డి గోవిందరెడ్డి తన గేదెలను మేపటానికి రోజూ మాదిరిగానే గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. ఈ క్రమంలో గేదెలు మేసుకుంటూ అప్పటికే తెగి కిందపడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో అందులో ఒక గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.80వేల ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నిరుపేద కుటుంబానికి చేయూత

వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన మెరుగు పున్నమ్మ అంధురాలు కావడంతో తన కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో ఉంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ ఎల్లపల్లి లక్ష్మీవెంకటేశ్ రూ.8వేలను, 50కేజీల బియ్యాన్ని స్థానికుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్లపల్లి శ్యామ్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, మెరుగు విక్రమేందకుమార్, మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ బచ్చు వెంకన్న, బంటు రాము, ముత్తయ్య, రవీందర్, సంధ్య, జానయ్య పాల్గొన్నారు.

నేత్ర దానంతో మరొకరికి చూపు

మిర్యాలగూడ అర్బన్ : నేత్రదానంతో మరొకరికి కంటి చూపు లభిస్తుందని డైమండ్ నేత్ర నిధి కార్యదర్శి మిట్టపల్లి విజయభాస్కర్ రావు అన్నారు. పట్టణంలోని నాళ్ల శంకరయ్య మరణించడంతో వాసవీక్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ ప్రోత్సాహంతో శంకరయ్య కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నేత్ర దాన అంగీకార పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య కుటుంబ సభ్యులతో పాటు టెక్నీషియన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి వినతి

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో స్థానిక వినాయక్‌నగర్‌లో మంగళవారం నాంపల్లి మండలానికి విద్యుత్‌సరఫరా అయ్యే 133 కేవీ లైన్ వైర్లు తెగిపడ్డాయి. కానీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. భవిష్యత్‌లోనూ ఎలాంటి ప్రమాదం చోటుచేఉసకోకుండా ఉండేందుకు కాలనీలోని ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి మరొక చోట ఏర్పాటు చేయాలని కోరుతూ మండల విద్యుత్ డీఈ విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లక్ష్మీనారాయణ, శ్రీను, తోటపల్లి వెంకటయ్య, శ్రీనివాస్,జంగయ్య పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని ఆలగడప నుండి ముల్కలకాల్వ గ్రామానికి వెళ్లే రహదారి వెంట దట్టంగా ఉన్న కంపచెట్లను శుక్రవారం కాకునూరి విజయ్‌కుమార్ తన సొంత ఖర్చుతో జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డు గుండా జాల్బాయితండా, రాయినిపాలెం, ముల్కలకాల్వ గ్రామాలకు నిత్యం వందలాది మంది వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారని రోడ్డు వెంట చెట్లు పెరిగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టార్ క్యాంపెనర్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, నాయకులు పులి లక్ష్మీనారాయణ, చిట్టబోయిన గురువ్య, గంధం రవి తదితరులున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మిర్యాలగూడ : ఆడపిల్లల భవిష్యత్ బాగుపడాలంటే బాల్య వివాహాలు అరికట్టినప్పుడే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని ఆశ్రిత సంస్థ కో ఆర్డినేటర్ శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నతనంలోనే ఆడపిల్లలకు పెళ్లి చేసినట్లయితే అనారోగ్యానికి గురవుతారని, తల్లిగా మారితే భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు తలెత్తి జీవితం అంధకారమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ 18ఏళ్లు నిండిన తరువాతనే చట్ట ప్రకారం పెళ్లి చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలకు పాల్పడినట్లయితే వారు చట్టపరంగా శిక్షింపబడుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ రమణి, కమ్యూనిటీ సోషల్ వర్కర్ కవిత, చిన్నరాయుడు, రూప్సీ, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కొండల్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శునకాలతో తప్పని తిప్పలు

- గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు
- వీధుల్లో గుంపులుగా చేరి ప్రజలు, పశువులపై దాడి
- నియంత్రణ చర్యలు చేపట్టాలని వేడుకోలు



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామంలోని వీధిలో ఓ కుక్క ఉందంటే ఏ దొంగ భయం ఉండదని ప్రజల విశ్వాసం.. కానీ అవే కుక్కలు స్థానికులను సైతం భయాందోళనకు గురిచేస్తుండటంతో వామ్మో కుక్కలు అంటూ ప్రజలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా కుక్కల బెడద అధికమైంది. ఏ వాడలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా చేరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బాటసారులు, వాహనచోదకులపైకి ఎగబడి గాయపరుస్తున్నాయి. మనుషులతో పాటు పాడి గేదెలపై కుక్కల దాడి పెరిగిపోయింది. సెప్టెంబర్ 25న అర్ధరాత్రి మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన మెండె రాములు ఎప్పటిలాగానే తన పశువులను దొడ్డిలో ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో కుక్కల గుంపు ఒక్కసారిగా పశువుల దొడ్డిలోకి ప్రవేశించి దాడి చేయడంతో రెండు గొర్రెలు, ఒక పొట్టేల్ మృతిచెందాయి. అంతకంటే పది రోజుల క్రితం ఇదే గ్రామంలో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ పరిస్థితుల్లో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు వణుకుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో గ్రామపంచాయితీల ఆధ్వర్యంలో కుక్కల నియంత్రణ చర్యలు తీసుకొనే వారు గత ఐదారేళ్లుగా కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోంది. కుక్కల బెడదను నియంత్రించాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల చంపడం నేరమని జంతు ప్రేమికులు అధికారులపై కేసులు వేస్తుండటంతో వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవడంపై వెనుకంజ వేస్తుండటంతో కుక్కలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.50వేలు నష్టపోయా



మా ఊరిలో కుక్కల బెడద అధికంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి నా పశువుల మందపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో ఒక గొర్రెతో పాటు, పొట్టేలును చంపేశాయి. గత వారం రోజుల క్రితం కూడా పశువుల మందపై కుక్కలు దాడి చేయడంతో అప్పుడూ ఒక గొర్రెను చంపేశాయి. మొత్తంగా వారం రోజుల వ్యవధిలోనే మూడు పశువులను చంపేశాయి. వాటి విలువ రూ. 50వేలు ఉంటుంది.

– మెండె రాములు, బాధితుడు

ఇబ్బందులు తప్పడం లేదు



రోజు రోజుకు కుక్కల బెడద ఎక్కువుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై గుంపులుగా చేరి దారి వెంట వచ్చి వెళ్లే వారిపై దాడి చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రమావత్ లాలు నాయక్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 207మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిందన్నారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీ బస్ వంటి అనేక హామీలను అమలు చేస్తూ పేదల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బసవయ్య, సైదులు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం



ఎంపీ రఘువీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

త్రిపురారం : పేద ప్రజల శేయస్సుకు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని బొక్కమంతల పాడులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యడవెల్లి రంగాశాయి రెడ్డి ఆధ్వర్యంలో పుట్టా ప్రభాకర్‌రెడ్డి(యుఎస్ఏ) వారి జ్ఞాపకార్థం శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై డాక్టర్ల బృందం వారం రోజులుగా ఉచిత కంటి పరీక్ష శస్త్ర చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చి పరిశీలించారు. డాక్టర్ల సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ ఎంపీ రఘువీర్‌రెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి రైతు వేదికలో నిర్వహించిన ఆయిల్ పాం రైతుల అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఆయిల్ పాం మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుండి దిగుబడులు ప్రారంభమవుతాయని తెలిపారు. 25ఏళ్ల వరకు దిగుబడి అందిస్తూ రైతులకు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుందని తెలిపారు. ఆయిల్ పాం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ రైతులు ఆయిల్ పాం సాగు చేసేలా చూడాలని సంబంధిత ఉద్యాన వన శాఖ అధికారులకు సూచించారు. త్వరలో రైతు రుణమాఫీ, రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు సాయిబాబ, శ్రీనివాసులు ,దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నల్లగాసు జాన్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్ నాయక్, రైతులు, తదితరులున్నారు.

అంగన్‌వాడీలపై సర్వే భారం మోపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

మిర్యాలగూడ : అంగన్‌వాడీ టీచర్లపై సర్వేల పేరుతో పని భారం మోపుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో అంగన్‌వాడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష అందించాలన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బొందు పార్వతి, ప్రధాన కార్యదర్శిగా సైదమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, రాధాబాయి, ప్రమీల, స్వరాజ్యం , రసీదా, అరుణ, విజయ్, శోభా పాల్గొన్నారు.

వింజమూరులో కంటి వైద్యశిబిరం

చింతపల్లి : మండల పరిధిలోని వింజమూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ దేవరకొండ సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవరకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, పులికంటి భాస్కర్, నల్ల నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో సుమారుగా 200మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.అందులో 25మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉందని డాక్టర్లు నిర్ధారణ చేయడంతో త్వరలోనే ఉచితంగా కంటి ఆపరేషన్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ నిర్మాణ కమిటీ సీనియర్ నాయకులు యాదయ్య, నిమ్మ వీరయ్య, శంకరయ్య, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మైసయ్య, ఉపాధ్యక్షులు శేఖర్, చంద్రయ్య, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు చిన్న, భార్గవ్, దశరథ, సైదులు పాల్గొన్నారు.



కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు



త్రిపురారం : కొణతాలపల్లిలో డిజిటల్ కార్డు సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ విజయకుమారి

చందంపేట : అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేయనున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పైలెట్‌ప్రాజెక్టుగా ఎంపికైన అచ్చంపేట పట్టి గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ, సర్వేను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. అర్హులందరూ డిజిటల్ కార్డుల కోసం తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఫ్యామిలీ డిజిట్ కార్డుల ద్వారా రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాల అమలు, ఆరోగ్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కిన్నెర హరికృష్ణ, మహాలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన నేనావత్ నందులాల్ మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు పార్వతి, గోవిందుయాదవ్, సర్వయ్య, అధ్యక్షుడు బద్యానాయక్ ఉన్నారు.

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

త్రిపురారం : ప్రతి కుటుంబం, వ్యక్తికి డిజిటల్ కార్డు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు సాగర్ నియోజకవర్గంలో త్రిపురారం మండలంలో కొణతాలపల్లిలో పైలెట్ ప్రాజెక్టు కింద కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే రెండో రోజు శుక్రవారం గ్రామంలో కొనసాగింది. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారు. గ్రామంలో మొత్తం 200 కుటుంబాలకు 71 బేస్ సర్వేతోపాటుగా 27 నూతన కుటుంబాలు నిర్ధారణ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీఓ విజయ కుమా రి, తహసీల్దార్ ప్రమీల, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా ఉండాలని తహసీల్దార్ ఎస్. హరిబాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని 23వ వార్డులోని అశోక్‌నగర్, వాసవీనగర్‌కాలనీ, సంతోష్‌నగర్‌లో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఎండీ జాఫర్, జేఏఓ ధనుంజయ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హాలియా : అనుముల మండలంలోని పులిమామిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకుపల్లి రాములు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుందూరు వెంకట్‌రెడ్డి మృతి చెందిన రాములు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పలువురి సంతాపం

చింతపల్లి: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంకణాల వెంకటరెడ్డి తల్లి, దశరథమ్మ కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీతో పాటు పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చందంపేట : అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందంపేట మండలంలోని బండమీదితండాకు చెందిన బావోజీ (పూజారి) సభావట్ లక్ష్మానాయక్‌ను శుక్రవారం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను కోరారు.

మాజీ జెడ్పీటీసీ పరామర్శ

వేములపల్లి(మాడుగులపల్లి): మాడుగులపల్లి మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బొల్లెంపల్లి లచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు మృతుని నివాసానికి వెళ్లి లచ్చయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

బాలాజీనాయక్‌కు పరామర్శ

చింతపల్లి : మండల పరిధిలోని బాలాజీ తండాకు చెందిన బాలాజీ నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ సాయి సంజీవని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాలాజీ నాయక్‌ను శుక్రవారం నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఆయన వెంట బొడ్డు గోపాల్ గౌడ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి ఇంటి నిర్మాణం కూల్చివేత



నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చారంటూ ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మూడావత్ లక్ష్మణ్‌నాయక్ ఇంటిని అక్రమ నిర్మాణమంటూ స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ శుక్రవారం తమ సిబ్బందితో వెళ్లి కూల్చివేశారు. లక్ష్మణ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల-హైదరాబాద్ రహదారి వెంట ముందు భాగంలో వేరే వ్యక్తిది చిన్న గది ఉంది.దాని వెనుక భాగంలో గత 40 ఏళ్లుగా రాళ్ల గోడ సరిహద్దుగా పెట్టుకోని నివాసముంటున్నట్లు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. రాళ్ల గోడపక్క నుంచి మనుషులు వెళ్లేందుకు దారి ఉందని తెలిపారు. రాళ్ల గోడ తీసి సిమెంట్ ఇటుకలతో నిర్మాణం చేస్తుండగా దారి అవతలివైపు ఉన్న ఇంటి యజమాని దారి పెద్దగా ఉండాలని పోలీసులను ఆశ్రయించాడని తెలిపారు. పోలీసులు గత నెల 27న పెద్దమనుషుల సమక్షంలో పంచనామా చేసి కొంత స్థలాన్ని వదిలి కట్టుకోవాలని పక్కింటి వారు కూడా అంతే స్థలాన్ని వదిలితే దారి పెద్దగా ఉంటుందని తెలిపి వెళ్లారు. పోలీసులు పెద్ద మనుషుల సూచనల మేరకు స్థలం వదిలి ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ తమ సిబ్బందితో వచ్చి నిర్మాణాన్ని కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాయకష్టం చేసుకోని జీవించే తాము అప్పులు చేసి ఇంటిని నిర్మించుకుంటుండగా కూల్చి వేయడం తగదని, ఈమేరకు స్థానిక పోలిస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మున్సిపాలిటీ ఎదుట ధర్నా

నందికొండలో ఇళ్లు, స్థలాలు నేటికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు కిందనే ఉన్నాయని మున్సిపాలిటీకి, రెవెన్యూకి అప్పగించలేదని స్థానిక కౌన్సిలర్ రమేశ్‌జీ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను కూల్చివేసే అధికారం కేవలం రెవెన్యూ అధికారులకే ఉందని తెలిపారు. రాజకీయ కక్షలతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి దనే నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చారని ఆరోపించారు. ఈ విషయంపై కమిషనర్ వివరణ కోరగా పక్కింటి వారు దారి లేకుండా లక్ష్మణ్‌నాయక్ ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేయడంతో నిర్మాణం కూల్చి వేసినట్లు పేర్కొన్నారు.

వైద్య సేవలన్నీ అందుబాటులో ఉండాలి

అడవిదేవులపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అడవిదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిథాయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి 'ఆశాడే' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీలో జరిగే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం వస్తున్న విష జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీతావాణి, దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ కేస రవి, వైద్యాధికారులు అజహర్ అహ్మద్, ఆంజనేయులుతో పాటు వైద్య సిబ్బంది తదితరులున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

ఘనంగా బతుకమ్మ సంబరాలు



మిర్యాలగూడ : మినా ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, విద్యార్థినులు



పెద్దవూర : బతుకమ్మలకు పూజలు చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, వైద్యసిబ్బంది



మిర్యాలగూడ టౌన్ : సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో..

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇబ్బందులు కలగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ వన్‌టౌన్, టూ టౌన్ సీఐ లు కరుణాకర్, నాగార్జున, ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాంమోహన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ డి.భారతీబాయి, అసిస్టెంట్ ఇంజనీర్ యాదగిరి, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్ బాబు, జానికిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సకాలంలో గుర్తించాలి

పెద్దవూర: వచ్చే సంవత్సరానికి గాను గ్రామాలలో చేపట్టబోయే ఉపాధి హామీ పనులను సకాలంలో గుర్తించాలని ఎంపీడీఓ మానె ఉమాదేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతర్గత రహదారుల మరమ్మతులపై సమీక్షా నిర్వహించారు. సమావేశంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, ముంతాజ్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం.. నేలవాలిన వరి



తిరుమలగిరిలో గాలివానకు నేలమట్టమైన వరిచేను



త్రిపురారం : దుగ్గెపల్లిలో ధ్వంసమైన గోశాల

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండల కేంద్రంలో పలువురి రైతుల వరి పంట నేలమట్టమైంది. మండల కేంద్రానికి చెందిన రైతు ఒంటెద్దు జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. పంటను ముందుగా సాగు చేయడంతో ప్రస్తుతం పంట పచ్చకంకి దశలో ఉంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇక్కసారిగా ఉన్నటుండి భారీ గాలివాన బీభత్సం సృష్టించడంతో కంకిదశలో ఉన్న పంట పూర్తిగా నేలవాలింది. రెండు సంవత్సరాలుగా కాలం అనుకూలించక భూములు బీళ్లుగా మారాయని ఈ ఏడాది పంటను సాగు చేస్తే పంట చేతికి వచ్చే దశలో నేలపాలయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరో రైతు శాగం వెంకట్రాంరెడ్డికి సంబంధిన మూడు ఎకరాల వరి పంట కూడా నేలమట్టమైనట్లు తెలిపారు. సంబంధిత వ్యవసాయ అధికారులు తమ పంట పొలాలను పరిశీలించాలని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఈదురు గాలులకు గోశాల ధ్వంసం

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురు గాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు శశికళ వ్యవసాయ క్షేత్రంలో సుమారు 5ఎకరాల్లో నిర్వహిస్తున్న శ్రీ సాయి మాదవగోసంరక్షణ కేంద్రంలో గోవులకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ గోసంరక్షణ కేంద్రంలో శశికళ సుమారు 70మేలు జాతి గోవులను సాకుతున్నారు. రేకుల షెడ్డు, గోడలు, నీటి తొట్లు సీసీ కెమెరాలు పూర్తిగా ధ్వంసమైనట్లు రైతు శశికళ తెలిపారు. సుమారు రూ. 16 లక్షలతో గోశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.